AKSHARA TODAY


# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM


6-8-2026 (Thursday) MAIN EDITION

## 140 టీఎంసీలకు చేరిన శ్రీశైలం ప్రాజెక్ట్



**అక్షరటుడే, కర్నూల్:** ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో నదిపై గల ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. కృష్ణా నదికి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో శ్రీశైలంకు భారీగా నీరు వచ్చి చేరుతోంది. నేటి నుంచి తెలంగాణ 'లెఫ్ట్ బ్యాంక్ పవర్ హౌస్'లో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనుండగా, ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్బీసీ, ఇతర సాగునీటి ప్రాజెక్టుల కోసం నీటిని ఎత్తిపోయడం మొదలుపెట్టనుంది. ప్రస్తుతం జలాశయంలోకి 2,31,168 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 140 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## బంగ్లా క్రికెటర్ ఇంటిపై పెట్రోల్ బాంబు దాడి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బంగ్లా క్రికెటర్ షకీబ్ అల్ హసన్ ఇంటిపై పెట్రోల్ బాంబు దాడి జరిగింది. బుధవారం రాత్రి ఆయన ఇంటిపై దాడి చేసి దుండగులు ధ్వంసం చేశారు. భారత్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో కలిసి వర్చువల్ విలేకరుల సమావేశంలో షకీబ్ అల్ హసన్ పాల్గొన్నారు. కొద్దిగంటల తర్వాత షకీబ్ అల్ హసన్ పూర్వీకుల ఇంటిపై పెట్రోల్ బాంబు దాడి జరిగింది. మగురా పట్టణంలోని కేశబ్‌మోర్ ప్రాంతంలో ఉన్న నివాసంపై ఈ దాడి జరిగింది.

## కేంద్రంపై కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు



**అక్షరటుడే, ఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇథనాల్ బ్లెండింగ్‌కు సంబంధించిన నివేదికను వెనక్కి తీసుకోవాలని 'సొసైటీ ఆఫ్ ఇండియా ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్'పై మోదీ సర్కార్ ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు.

## చెవి నొప్పితో ఆసుపత్రికి వెళ్తే చేయి తీసేశారు



**అక్షరటుడే, బిహార్:** బిహార్ రాజధాని పాట్నాలో వైద్యుల తీవ్ర నిర్లక్ష్యం ఒక యువతి జీవితాన్ని అంధకారంలోకి నెట్టేసింది. చెవి నొప్పితో ఆస్పత్రికి వెళ్లిన రేఖ తప్పుడు వైద్యం కారణంగా తన చేతిని కోల్పోవాల్సి వచ్చింది. చికిత్స సమయంలో సిబ్బంది తప్పుడు ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల అది వికటించడం చేయి తొలగించాల్సి వచ్చింది.

## వైసీపీకి చంద్రబాబు వార్నింగ్



**అక్షరటుడే, ఏపీ:** రాజకీయ ముసుగులో వైసీపీ నేతలు నేరాలకు పాల్పడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ అరాచకాలను అరికట్టేందుకు రెండు నిమిషాలు చాలు అంటూ వార్నింగ్ ఇచ్చారు. డీఎస్సీపై కోర్టులు చీవాట్లు పెట్టినా దుష్ప్రచారం ఆపడం లేదని మండిపడ్డారు.

## వైద్య రంగంలో అద్భుతం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలోనే అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన మొదటి పూర్తి స్వదేశీ ఎంఆర్ఐ స్కాన్ మెషిన్‌ను 'వోక్సెల్ గ్రిడ్స్' అనే స్టార్టప్ అందుబాటులోకి తెచ్చింది. న్యూయార్క్‌లోని జీఈ కార్పొరేట్ సంస్థలో భారీ జీతంతో పనిచేస్తున్న భారతీయ ఇంజినీర్ డాక్టర్ అర్జున్ అరుణాచలం.. దేశీయ అవసరాలకు తగ్గట్టుగా వైద్య పరికరాలను అందించాలనే లక్ష్యంతో తన ఉద్యోగాన్ని వదిలి భారత్‌కు తిరిగి వచ్చారు. దాదాపు 12 సంవత్సరాల పాటు నిరంతర పరిశోధనలు చేసి, పూర్తిగా భారత్‌లోనే ఈ మెషీన్‌ను తయారు చేశారు. ఈ ప్రాజెక్టుకు టాటా ట్రస్ట్‌స్‌తో పాటు జోహో సంస్థ అధినేత శ్రీధర్ వేంబు రూ.35 కోట్ల పెట్టుబడితో మద్దతుగా నిలిచారు.



## మంత్రులతో నారా లోకేశ్ కీలక భేటీ

**అక్షరటుడే, ఏపీ:** రాష్ట్ర కేబినెట్ సమావేశానికి ముందు విద్యుత్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంత్రులతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ భేటీలో చర్చించారు. ఎన్నికలు నిర్దేశిత సమయానికే జరుగుతాయని స్పష్టం చేసిన ఆయన.. ఇప్పట్నుంచే సన్నద్ధం కావాలని మంత్రులకు పిలుపునిచ్చారు. స్థానిక పోరులో కూటమి అభ్యర్థులే భారీ మెజారిటీ సాధించేలా క్షేత్రస్థాయి ప్రచారంపై లోకేశ్ ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల చేశారు.




# ఇక స్మార్ట్ రేషన్ కార్డులు

■ ఆగస్టు 15 నుంచి పంపిణీ ■ సంగారెడ్డి జిల్లాలో ప్రారంభించనున్న సీఎం

**తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు మరో తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న రాష్ట్రంలో నూతన పీడీఎస్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోంది. ఈ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా కేంద్రంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసింది. అయితే ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కిన.. భౌతికంగా కార్డులు మాత్రం పంపిణీ చేయలేదు. దీంతో ప్రభుత్వం కొత్తగా స్మార్ట్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. సంగారెడ్డిలో సీఎం పంపిణీ ప్రక్రియను ప్రారంభించిన వెంటనే, రాష్ట్రంలోని అన్ని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు కార్డులను నేరుగా అందజేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

### స్మార్ట్ కార్డులు..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల కుటుంబాలకు లామినేటెడ్ (పీవీసీ) రూపంలో రూపొందించిన నూతన రేషన్ కార్డులను అందించనున్నారు. వాటర్‌ప్రూఫ్, క్రెడిట్ కార్డు పరిమాణంలో అత్యంత ఆకర్షణీయంగా ఉండే ఈ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు ఆధునిక భద్రతా ప్రమాణాలను పొందుపరిచారు.

కలెక్టర్లకు కీలక ఆదేశాలు

### రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం

విజయవంతంగా సాగేందుకు ప్రభుత్వం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందేలా తుది లబ్ధిదారుల జాబితాల ధృవీకరణను త్వరితగతిన పూర్తి చేయాలి. రేషన్ కార్డుల ముద్రణ స్థాయి నుండి జిల్లాలకు చేరే వరకు సురక్షితమైన రవాణా నిర్వహణపై పౌరసరఫరాల శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. పంపిణీ కార్యక్రమం ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగేందుకు జిల్లా కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలి. పంపిణీ ప్రక్రియ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి అందజేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయంతో లక్షలాది కుటుంబాలకు నూతన రేషన్ కార్డుల కల నెరవేరనుంది.

## ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు అన్యాయం: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి సామంత రాజులా ఢిల్లీకి తిరుగుతున్నారని, లోక్‌సభలో బీజేపీ ఎంపీ తెలంగాణను అవమానించినా కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు నోరుమెదపలేదని విమర్శించారు. మనకేమో జయశంకర్ సార్ గురువు అని.. రేవంత్ రెడ్డికేమో చంద్రబాబు నాయుడు గురువు అన్నారు. అందుకే పుష్కలంగా నీళ్లున్న మోటార్లు ఆన్ చేస్తలేరని విమర్శించారు.


## కాంగ్రెస్‌కు హరీశ్ రావు వార్నింగ్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తాను క్షుద్రపూజలు చేశానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఆధునిక యుగంలో ఇలాంటి నిందలు వేయడం సిగ్గుచేటని, రాజకీయ విమర్శలకు ఒక హద్దు ఉంటుందని ఆయన అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, స్కాములను ప్రశ్నిస్తున్నందుకే కాంగ్రెస్ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. క్షుద్రపూజల అంశంపై ఇష్టానుసారంగా మాట్లాడిన కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ సూట్, పరువు నష్టం దావా వేయనున్నట్లు హరీశ్ రావు స్పష్టం చేశారు. ఇప్పటికే వారికి నోటీసులు పంపామని, లీగల్ యాక్షన్‌కు సంబంధించి ఇంకా 30 రోజుల సమయం ఉందని తెలిపారు.

## జెప్టో, బుక్‌మైషో, ఇండిగోలకు కేంద్రం జరిమానా

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** డార్క్ ప్యాటర్న్‌తో వినియోగదారులను మోసం చేస్తున్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు కేంద్రం షాక్ ఇచ్చింది. జెప్టో, బుక్‌మైషో, ఇండిగో సహా 9 యాప్‌లకు రూ.20 లక్షల జరిమానా విధించింది. వినియోగదారులు తాము చేయాలనుకోని ఎంపికలు చేసేలా వారిని తారుమారు చేయగల వెబ్‌సైట్, యాప్ డిజైన్లైన "డార్క్ ప్యాటర్న్స్"ను ఉపయోగించినందుకు, సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) తొమ్మిది డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై జరిమానా విధించింది. జెప్టో వినియోగదారులకు మొదట చూపిన ధరలను, ఆ తర్వాత హ్యాండ్లింగ్ ఛార్జీలు, సభ్యత్వ రుసుముల ద్వారా పెంచినట్లు సీసీపీఏ కనుగొంది. దీంతో జెప్టోకు రూ.7 లక్షల జరిమానా విధించింది.




## జార్ఖండ్‌లో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళన



**అక్షరటుడే, జార్ఖండ్:** పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. అయిన రాష్ట్రంలోని జేఎంఎం, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించక పోవడం గమనార్హం. నిరాహార దీక్ష చేస్తున్న రాహుల్ క్రాంతి గురువారం మీడియాతో మాట్లాడారు. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా లేదన్నారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా.. బీజేపీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతిపక్షం రాష్ట్ర అసెంబ్లీ బయట రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టింది. ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ ఎమ్మెల్యే నిర్మల్ మహతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. గవర్నర్, రాష్ట్రపతి పాలన యంత్రాంగం ప్రత్యక్ష పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించాలని కోరారు.

## 'తెహల్కా' తరుణ్ తేజ్‌పాల్ దోషిగా తేల్చిన కోర్టు



**అక్షరటుడే, మహారాష్ట్ర:** తెహల్కా పత్రిక వ్యవస్థాపకుడు తరుణ్ తేజ్‌పాల్‌కు కోర్టు షాక్ ఇచ్చింది. 2013 నాటి లైంగిక దాడి కేసులో గోవాలోని బాంబే హైకోర్టు అతడిని దోషిగా నిర్ధారించింది. 2013లో తన జూనియర్ సహోద్యోగి దాఖలు చేసిన అత్యాచారం కేసులో గోవా హైకోర్టు గురువారం ఆయనను దోషిగా నిర్ధారించింది. 2021లో ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా విడుదల చేయగా, ఆ తీర్పును హైకోర్టు రద్దు చేసింది. ఈ తీర్పుపై గోవా ప్రభుత్వం అప్పీల్ చేసింది. ఇరుపక్షాల వాదనలను క్షుణ్ణంగా విన్న తర్వాత జస్టిస్ డాక్టర్ నీలా గోఖలే, అమిత్ జమ్సందేకర్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.

## తెల్లాపూర్‌లో విషాదం.. చెరువులో పడి బాలుడి మృతి

**అక్షరటుడే, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో విషాదం చోటు చేసుకుంది. తెల్లాపూర్ చెరువులో పడి ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. శ్రీకర్ వండర్ నెస్ట్ ప్లే స్కూల్లో షణ్ముక్‌ను తండ్రి ఉదయ్ కిరణ్ దింపాడు. అయితే ప్లే స్కూల్లో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నాడు. దీంతో షణ్ముక్ ఆడుకుంటూ బయటకు వెళ్లాడు. పాఠశాల పక్కనే చెరువు ఉండటంతో ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్లే స్కూల్ నిర్వాహకుల నిర్లక్షం కారణంగానే బాలుడు చనిపోయాడని తల్లిదండ్రులు ఆగ్రమం వ్యక్తం చేశారు.

## తెలంగాణకు చేరుకున్న ఒడిశా నైనీ బ్లాక్ బొగ్గు

**అక్షరటుడే, మంచిర్యాల :** ఒడిశాలోని నైనీ బ్లాక్ బొగ్గు తెలంగాణకు చేరుకుంది. ఈ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకున్న విషయం తెలిసిందే. అక్కడ ఉత్పత్తి అయిన బొగ్గు తొలిసారి తెలంగాణకు వచ్చింది. మంచిర్యాల జిల్లాలోని థర్మల్ ప్లాంట్‌కి నైనీ బ్లాక్ నుంచి బొగ్గు తీసుకొని గూడ్స్ రైలు వచ్చింది. ఈ రైలులో 4 వేల టన్నుల బొగ్గును తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. రైలుకు జెండా ఊపి సింగరేణి అధికారులు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ ఇంధన రంగానికి భారీ ఊతమిస్తూ నైని బొగ్గు బ్లాక్ నుంచి మొదటి బొగ్గు రవాణా (రేక్) గురువారం సింగరేణి థర్మల్ పవర్ స్టేషన్‌కు చేరుకుంది. విద్యుత్ ఉత్పత్తిని బలోపేతం చేయడం, దీర్ఘకాలిక ఇంధన భద్రతను కల్పించడంలో రాష్ట్రం చేస్తున్న కృషిలో ఇది ఒక చారిత్రాత్మక మైలు రాయిగా నిలిచింది.

